
సాక్షి ఒడిశా

శుక్రవారం । 1 । మార్చి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ.1,87,240

బంగారం 150 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



సూపర్‌వైజర్ల సేవలు క్రమబద్ధీకరణ

మహిళా, శిశు సంక్షేమాభివృద్ధి శాఖకు చెందిన 504 మంది కాంట్రాక్ట్ సూపర్‌వైజర్ల సేవల క్రమబద్ధీకరణ ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి గురువారం ఆమోదం తెలిపింది.

- 8లో▸



బీజేపీలోకి ఎమ్మెల్యే ప్రశాంత్

బీజేడీ బహిష్కృత నేత, చిలికా ఎమ్మెల్యే ప్రశాంత్ జగ్‌దేవ్ గురువారం బీజేపీలో చేరారు.

- 8లో▸

న్యూస్‌రీల్

ఎలుగుబంటి సంచారం



గ్రామ సమీపంలో సంచరిస్తున్న ఎలుగు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కొసాగుమ్డ గ్రామం వద్ద ఒక ఎలుగు బంటి గురువారం సంచరించింది. ఆహారం కోసం గ్రామంలో చొరబడడానికి ప్రయత్నం చేసింది. ఇది చూసిన వాహనదారులు పెద్ద ఎత్తున హారన్లు మోగించడంతో తిరిగి అడవిబాట పట్టింది. సమీపంలోని అడవిలో చెట్లను కొట్టివేస్తుండడంతో ఎలుగుబంట్లు గ్రామాల్లోకి వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొటియాలో వైద్య శిబిరం



వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

జయపురం: ఆంధ్రప్రదేశ్ – ఒడిశా రాష్ట్రాల మధ్య వివాదాస్పదంగా ఉన్నటువంటి కొటియా గ్రామాల్లో ఆంధ్రప్రదేశ్ పోలీసు అధికారులు ఉచిత వైద్య శిబిరాన్ని బుధ, గురువారాల్లో నిర్వహించారు. నేరేడివలసలో నిర్వహించిన వైద్య శిబిరంలో 400 మందికి వైద్య పరీక్షలు జరిపినట్లు సమాచారం. ఈ శిబిరంలో పార్వతీపురం మన్యం జిల్లా అదనపు పోలీసు సూపరింటెండెంట్ సునీల్ షారోన్, సాలూరు సీఐ బాలకృష్ణ, కొటియాలో ఆంధ్ర సీఐ రోహిణీపతి, సాలూరు రూరల్ ఎస్ఐ వెంట రమణ తదితరులు పాల్గొన్నారు.

'పోలియో వ్యాక్సినేషన్ తప్పనిసరి'



సమావేశంలో పాల్గొన్న అధికారులు

మల్కన్‌గిరి: ఈనెల 3వ తేదీన జరగనున్న పోలీయో కార్యక్రమంలో 5 ఏళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా వ్యాక్సినేషన్ చేయించాలని జిల్లా వైద్యాధికారి ప్రఫుల్ల కుమార్ నందో పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని 76,095 మంది చిన్నారులకు పోలీయో చుక్కలు వేయాల్సి ఉందన్నారు. 3వ తేదీ వేయని చిన్నారులకు 4, 5 తేదీల్లో మెడికల్ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తారని తెలియజేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వేద్బార్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపడి అంగన్‌వాడీ కార్యకర్త మృతి



నరసమ్మ మృతదేహం

బరంపురం: గంజాం జిల్లాలోని దిగపండి బ్లాక్‌లో పిడుగుపడి అంగన్‌వాడీ కార్యకర్త మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. దిగపండి బ్లాక్ పరిధి బాసుదేవ్‌పూర్ గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త ఎ.నరసమ్మ(48) బుధవారం పొలం పనికి వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఆ సమయంలో నరసమ్మపై ఒక పిడుగు పడింది. అలాగే మరో పిడుగు ఆమె భర్త ఎ.వరుణరావు, మరో మహిళపై పడడంతో తీవ్ర గాయాలపాలయ్యారు. దీంతో గ్రామస్తులు ముగ్గురినీ బరంపురం ఎంకేసీజీ ఆస్పత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం నరసమ్మ మృతి చెందింది. దీంతో గ్రామంలో విషాదం నెలకొంది.

సందడే.. సందడి

స్థానిక కళ్లికోట్ విశ్వ విద్యాలయం క్రీడా మైదానంలో మహానగర్ సాంస్కృతిక పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహానగర్ ఉత్సవాలు సందడిగా కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా బుధవారం రాత్రి సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు చేపట్టారు. ఒడిస్సీ నృత్యం, సంబల్‌పూరి నృత్యం, బాల రామయణం, ఆధునిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా బీజేపీ నగర అధ్యక్షుడు కన్నుచరణ్ పతి పాల్గొని కళాకారులను ప్రత్యేకంగా సత్కరించారు. కార్యక్రమంలో బీడీఏ మాజీ చైర్మన్ సుభాష్ మహరణ, గోపాల్ పట్నాయక్, సుదీప్ సాహు, నారాయణ మంకుడో తదితరులు పాల్గొన్నారు.

– బరంపురం



మాట్లాడుతున్న బీజేపీ నగర అధ్యక్షుడు కన్నుచరణ్ పతి



ఒడిస్సీ నృత్య ప్రదర్శన



యువతుల నృత్య ప్రదర్శన



రాధాగోపాలం నృత్య ప్రదర్శన



సంబల్‌పూరి నృత్యం



సేవ్ గర్ల్ చైల్డ్ ఇతివృత్తంతో నృత్యం

అయోధ్యకు ప్రత్యేక రైలు





రైల్వే శాఖ విడుదల చేసిన అయోధ్య ప్రత్యేక రైలు వివరాలు

కొరాపుట్: కొరాపుట్ జిల్లా నుంచి అయోధ్యకు ప్రత్యేక రైలు నడపనున్నారు. మార్చి 4వ తేదీ సాయంత్రం 6 గంటలకు జయపూర్ నుంచి బయల్దేరి కొరాపుట్, రాయగడ, సింగ్‌పూర్ రోడ్, టిట్లాగఢ్, సంబల్‌పూర్, ఝార్సుగుడ, రౌర్కెలా, గయా, వారణాసి మీదుగా వెళ్తూ 6వ తేదీ వేకువ జామున 3.30కి అయోధ్య సమీపంలోని దర్శన్‌నగర్ చేరుకుంటుంది. మరలా 7వ తేదీ ఉదయం 8 గంటలకు దర్శన్‌నగర్ నుంచి బయల్దేరి 8వ తేదీ సాయంత్రం 3.30కి జయపూర్ చేరుకుంటుంది. ఈ రైలులో రానుపోను కలిపి ఒక్క టిక్కెట్ ధర రూ.1,775లుగా నిర్ణయించారు. ఈ టిక్కెట్ ద్వారా మార్గమధ్యలో ఆహారం, అయోధ్యలో వసతి, ప్రత్యేక దర్శనం ఉచితం కల్పిస్తారు. ఆస్థా సంస్థ ఈ రైలు ఏర్పాటు చేసింది. రైలు 08575 నంబర్‌తో నడవనుంది. టిక్కెట్లు కేవలం హిందూ పరివార్ సంస్థల ద్వారా విక్రయిస్తున్నారు. ఆన్‌లైన్, రైల్వే బుకింగ్ కౌంటర్ల వద్ద లభించవు.

దోపిడి దొంగల ముఠా అరెస్టు



అరెస్టైన దుండగులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న మారణాయుధాలు

బరంపురం: పెట్రోల్ బంక్‌లోని క్యాష్ కౌంటర్‌పై దాడికి సిద్ధమవుతున్న దోపిడీ ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ఐఐసీ అధికారి భూపతి దేవ్ తెలిపిన వివరాల మేరకు.. పెద్ద బజార్ పోలీసుస్టేషన్ పరిధిలోని బల్లిపడా పెట్రోల్ బంకుపై దాడికి సిద్ధమవుతున్న వ్యక్తులను పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు గమనించారు. దీంతో వారిని చాకచక్యంతో అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో అమిత్ నాయక్, షేక్ అసిఫ్, రామ్‌పాత్రోలు ఉన్నట్లు గుర్తించారు. అరెస్టైనవారి నుంచి బైక్, తుపాకీ, రెండు కత్తులు, ఇనుప రాడ్లు, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

భారీగా గంజాయి స్వాధీనం



బరంపురం: అరెస్టైన వ్యక్తిని చూపిస్తున్న ఎక్సైజ్ అధికారులు



మల్కన్‌గిరి: సీజ్ చేసిన గంజాయి బస్తాలతో పోలీసులు

బరంపురం: గంజా జిల్లాలోని దిగపండి నుంచి బరంపురం తరలిస్తున్న గంజాయిని ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. అక్రమంగా గంజాయి రవాణా జరుగుతున్నట్లు బరంపురం ఎక్సైజ్ అధికారులకు ముందస్తు సమాచారం అందింది. దీంతో హింజికాట్–దిగపండి–బరంపురం మూడు రోడ్ల జంక్షన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో బరంపురం నగరంలోకి ప్రవేశిస్తున్న బొలేరో వాహనంపై ఫస్ట్ గేట్ దగ్గర దాడి చేశారు. వాహనంలో తరలిస్తున్న 1,152 కిలోల గంజాయిని, వాహనాన్ని సీజ్ చేశారు. అరెస్టైన డ్రైవర్ సంతోష్ పండాగా గుర్తించారు.

రాయగడ: లారీలో అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పద్మపూర్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 1,365 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కోర్టుకు తరలించారు. అరెస్టైనవారిలో బీహార్‌కు చెందిన శ్రావణ్ పాల్ (30), రాజేంద్ర రౌత్ (65)లు ఉన్నట్లు వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే.. గురువారం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో గంజాయి అక్రమ రవాణా జరుగుతుందని వచ్చిన సమాచారం మేరకు పద్మపూర్ పోలీసులు పద్మపూర్ కూడలిలో వాహన తనిఖీలను నిర్వహించారు. ఈ క్రమంలో గజపతి జిల్లా అడవా నుంచి కొబ్బరికాయల లోడుతో వస్తున్న లారీని తనిఖీ చేశారు. బస్తాల మధ్యలో అమర్చిన 39 ప్లాస్టిక్ బ్యాగుల్లో గంజాయి బయటపడింది. నిందితుల నుంచి రూ.5 వేల నగదు, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి ఎక్సైజ్ పోలీసులకు గంజాయి అక్రమంగా రవాణా అవుతున్నట్లు ముందస్తు సమాచారం వచ్చింది. దీంతో మత్తిలి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ కుమార్ బాల్ తన సిబ్బందితో కలిసి సెమిలీబంచ్ గ్రామ సమీపంలోని అడవి వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 6 గంజాయి బస్తాలను తరలించేందుకు సిద్ధంగా ఉన్న వ్యక్తి పట్టుబడ్డాడు. అతడిని అరెస్టు చేసి 156 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.20 లక్షలు ఉంటుందని ఎక్సైజ్ పోలీసు ఓఐసీ ప్రభాకర్ శెట్టి తెలిపారు.



రాయగడ: గంజాయితో పట్టుబడిన నిందితులు

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న విస్తరణాధికారి అభాప్రదాన్

జయపురం: జయపురం సమితి ఎకంబా గ్రామ మైదానంలో ఎస్‌డీసీ కప్ క్రికెట్ టోర్నమెంట్ గురువారం ప్రారంభమైంది. సమితి సంక్షేమ విస్తరణాధికారి అభాప్రదాన్ నేతృత్వంలో పోటీలు నిర్వహిస్తున్నారు. తొలిరోజు జరిగిన మ్యాచ్‌లలో పంపుణి, గొడపాదర్, ఎకంబా, రాణిగుడ పంచాయతీలు విజయం సాధించాయి. కార్యక్రమంలో జయపురం సమితి అధ్యక్షురాలు తిలోత్తమ ముదిలి, జిల్లా పరిషత్ సభ్యురాలు రశ్మీ రత్, అస్తా నాయిక్, తొపతి పట్నాయిక్, ఎస్‌డీసీ సభ్యుడు బైద్యనాథ్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ప్రదీప్ మహంతి తదితరులు పాల్గొన్నారు.

'రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆందోళన'



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపడుతున్న గ్రామస్తులు

పర్లాకిమిడి: గుసాని సమితి ఉప్పలాడ పంచాయతీ చందనకోలా–పాటికోట గ్రామస్తులు రోడ్డు నిర్మించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద గురువారం ఆందోళన చేపట్టారు. ప్రతిరోజూ ఈ రోడ్డు మీదుగా చందనకోలా, ఖరడా, ఖేతాడా, అర్లి, అంగేరాడ, లక్ష్మీపూర్‌కు చెందిన సుమారు 2500 మంది ప్రయాణాలు చేస్తుంటారని తెలియజేశారు. అయితే సరైన రహదారి లేకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై గుసాని సమితి అధికారులకు వినతులు అందించినా ఫలితం లేకపోయిందన్నారు. నెల రోజుల్లో రోడ్డు సౌకర్యం కల్పించకపోతే అసెంబ్లీ ఎన్నికలు బహిష్కరిస్తామని హెచ్చరించారు. దీంతో కలెక్టర్ స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం గ్రామస్తులు ఆందోళన విరమించారు.

క్లుప్తంగా

హోటళ్లపై అధికారుల ఆకస్మిక దాడులు



హోటళ్లలో దాడులు చేపడుతున్న అధికారులు

రాయగడ: స్థానిక న్యూకాలనీ సమీపంలోని సాయిరాం పార్లర్ అనే హోటల్‌లో పాడైపోయిన ఆహారాన్ని పార్శిల్ ఇవ్వడంతో నాణ్యత లోపించిన ఆహార పదార్థాలను విక్రయిస్తున్నారని ఒక వ్యక్తి చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో స్పందించిన సంబంధిత శాఖ అధికారులు బుధవారం రాత్రి హోటళ్లపై ఆకస్మిక దాడులు చేపట్టారు. మున్సిపాలిటీ పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్ ఐ.బాలరాజు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ జ్యోతి ప్రకాష్ సోరెన్‌లతో పాటు మున్సిపాలిటీ సిబ్బంది ఈ దాడుల్లో పాల్గొన్నారు. ముందుగా సాయిరాం పార్లర్‌లో తనిఖీలు నిర్వహించిన అధికారులు నాణ్యత లోపించిన ఆహారాన్ని విక్రయిస్తున్నట్లు గుర్తించి రూ.4 వేల జరిమానా విధించారు. అలాగే మరో పది హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో దాడులు చేపట్టారు. నాణ్యమైన ఆహారం విక్రయించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అయితే కొద్దికాలంగా పట్టణంలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై అధికారులు ఎటువంటి నిఘా ఉంచకపోవడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ చౌర్యంపై కేసులు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న వారిపై విద్యుత్ విజిలెన్స్ సిబ్బంది కేసులు నమోదు చేస్తున్నారు. తాజాగా కుప్పిలి గ్రామంలో బల్లాడ సీతయ్యరెడ్డి అనే వ్యక్తి డీటీఆర్ నుంచి రాత్రిళ్లు డైరెక్ట్ టాపింగ్ చేసి విద్యుత్ చౌర్యం చేయటాన్ని గుర్తించారు. ఈ మేరకు రాత్రి తనిఖీ నిర్వహించి అసెస్మెంట్ రూ. 89,215, కాంపౌండ్ రూ.7000 మొత్తం రూ. 96,215 అపరాధ రుసుం విధించారు. కుప్పిలి గ్రామంలో నాయన సూర్యనారాయణ రెడ్డి అనే వ్యక్తి కోళ్ల ఫారంలో రాత్రిళ్లు డైరెక్ట్ టాపింగ్ చేస్తున్నట్లు గుర్తించారు. రూ. 35,979 అపరాధ రుసుం విధించారు. ఈ ప్రాంతంలో గత కొంతకాలంగా విద్యుత్ చౌర్యం చేస్తున్న 28 మందిపై కేసులు నమోదు చేశారు. తనిఖీల్లో సీఐ ఎం.వెంకటనారాయణ, ఏడీఈ చంద్రమౌళి బృందం పాల్గొంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని తాళ్లవలస సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదపాక సూర్యరావు (52) అనే వ్యక్తి మృతి చెందారు. తాళ్లవలస గ్రామానికి చెందిన సూర్యరావు జాతీయ రహదారి దాటుతుండగా రణస్థలం నుంచి శ్రీకాకుళం వస్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే ఊపిరి వదిలేశారు. మృతుడికి భార్య అచ్చెలమ్మతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరంతా సంఘటనా స్థలానికి చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతుని భార్య అచ్చెలమ్మ ఫిర్యాదుమేరకు ఎస్‌ఐ సీహెచ్ స్వామినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని వృద్ధుడు మృతి

టెక్కలి రూరల్: మండలంలోని శ్యామసుందరాపురం గ్రామ సమీప జాతీయ రహదారిపై గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు ఢీకొని సకలభక్తుల సత్యం(68) అనే వృద్ధుడు మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. గార మండలం తంగులపేట గ్రామానికి చెందిన సత్యం టెక్కలిలో తన బంధువుల ఇంటిలో జరిగిన శుభకార్యానికి వచ్చి తిరిగి వెళ్లే క్రమంలో.. శ్యామసుందరాపురం జంక్షన్ వద్ద రోడ్డు దాటుతుండగా కోటబొమ్మాళి నుంచి పలాస వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆయనను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే ఆయన అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై టెక్కలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కొట్లాటలో గాయపడిన వ్యక్తి మృతి



మృతి చెందిన యడ్ల రమణ (ఫైల్)

నరసన్నపేట: మండలంలోని బొరిగివలస లో మూడు రోజుల కిందట జరిగిన కొట్లాట లో గాయపడిన యడ్ల రమణ (30) అనే వ్యక్తి గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి వెళ్లి ఎంక్వైరీ చేశారు. తల్లి సింహాద్రి, తండ్రి నీలయ్య, భార్య శాంతమ్మల నుంచి వివరాలు సేకరించారు. మూడు రోజుల కిందట తగువు జరిగిందని, బంగాపు సూర్యనారాయణ తదితరులు రమణను కొట్టారని, వెంటనే ఆస్పత్రిలో జాయిన్ చేశామని చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడని తండ్రి నీలయ్య తెలిపారు. ఈ సంఘటనపై నరసన్నపేట ఎస్‌ఐ అశోక్‌బాబు మాట్లాడుతూ గ్రామానికి వెళ్లి పరిశీలన చేశామని కుటుంబ సభ్యుల నుంచి వివరాలు తీసుకున్నామని, 174 సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

బీజేపీలోకి ఎమ్మెల్యే ప్రశాంత్



బీజేపీ నాయకులతో ఎమ్మెల్యే ప్రశాంత్ జగదేవ్

భువనేశ్వర్: బీజేడీ బహిష్కృత నేత, చిలికా ఎమ్మెల్యే ప్రశాంత్ జగ్‌దేవ్ గురువారం పార్టీ ఫిరాయించారు. స్థానిక బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ఆయన భారతీయ జనతా పార్టీలో చేరారు. బీజేపీ రాష్ట్ర వ్యవహారాల సమన్వయ ఇన్‌చార్జి లతా ఉసేంది, భువనేశ్వర్ లోక్‌సభ సభ్యురాలు అపరాజిత షడంగి, ఆ పార్టీ రాష్ట్ర శాఖ మాజీ అధ్యక్షుడు సమీర్ మహంతి సమక్షంలో బీజేపీలో చేరారు. గోపాల్‌పూర్ నియోజకవర్గంలో 3 సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన డాక్టర్ ప్రదీప్ కుమార్ పాణిగ్రాహి తర్వాత, ఈ నెలలో బీజేపీలో చేరిన బీజేడీ బహిష్కృత నేత ప్రశాంత జగదేవ్ రెండో నాయకుడు కావడం విశేషం.

2021లో సస్పెన్షన్

గతేడాది జనవరి నుంచి సస్పెన్షన్ తొలగింపు కోసం ప్రశాంత్ నిరీక్షించారు. ఈ నిరీక్షణ ఫలప్రదం కాకపోడంతో పార్టీ మారేందుకు నిర్ణయించారు. పార్టీలో గత కొన్ని దశాబ్దాలుగా తనపై కుట్రలు జరుగుతున్నట్లు ఆరోపించారు. 2009లో చిలికా నుంచి ఎన్నికైన మాజీ శాసనసభ్యుడు రఘునాథ్ సాహు తనపై కుట్రపన్నారన్నారు. 2014లో బీజేపీకి చెందిన బిభూతి భూషణ్ హరిచందన్ చిలికా నియోజకవర్గం కైవసం చేసుకోవడంతో తదుపరి 2019లో జరిగిన ఎన్నికల్లో ఈ స్థానం నుంచి తనకు బీజేడీ పోటీకి దింపిందని తెలిపారు. 2021 సెప్టెంబర్‌లో చిలికా సరస్సు సమీపంలో బీజేపీకి చెందిన దళిత నాయకుడిపై దాడి చేశారనే ఆరోపణలతో కొన్ని గంటల్లోనే ప్రశాంత జగదేవ్‌ని సస్పెండ్ చేశారు. ఆ తర్వాత ఈ కేసుకు సంబంధించి అరెస్టు చేసి జైలుకు పంపారు. ఖుర్దా జిల్లా బణోపూర్ మండల కార్యాలయం వెలుపల బీజేపీ మద్దతుదారులు, పోలీసు సిబ్బందితో బాహాటంగా ఘర్షణకు దిగడంతో వివాదం కలకలం రేపింది. ఈ వివాదంలో 2022 సంవత్సరం మార్చి నెలలో అరెస్టు చేశారు. అతను ఒక సంవత్సరం పాటు తన అసెంబ్లీ నియోజకవర్గాన్ని సందర్శించకూడదనే షరతుతో జులై 2022లో, ఖుర్దా జిల్లా బణోపూర్ సబ్ జైలు నుంచి ఈ కేసులో సుప్రీంకోర్టు అతనికి బెయిల్ మంజూరు చేయడంతో విడుదలయ్యాడు. అత్యవసర పరిస్థితుల్లో జిల్లా మేజిస్ట్రేట్, కలెక్టర్ అనుమతితో మాత్రమే సందర్శించేందుకు అనుమతించారు. 5 మందికి పైబడిన సభ్యులతో సభలు, సమావేశాలు నిర్వహించరాదని కోర్టు ఆంక్షలు విధించింది..

సూపర్‌వైజర్ల సేవలు క్రమబద్ధీకరణ



వివరాలు వెల్లడిస్తున్న సీఎస్ ప్రదీప్ కుమార్ జెనా

భువనేశ్వర్: మహిళా, శిశు సంక్షేమాభివృద్ధి శాఖకు చెందిన 504 మంది కాంట్రాక్ట్ సూపర్‌వైజర్ల సేవల క్రమబద్ధీకరణ ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి గురువారం ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అధ్యక్షతన జరిగిన 75వ విడత మంత్రి మండలి సమావేశమిది. కాంట్రాక్ట్ సూపర్‌వైజర్ల అసోసియేషన్ల డిమాండ్ నేపథ్యంలో మంత్రి మండలి కమిటీ క్రమబద్ధీకరించేందుకు తీర్మానించింది. ఈ నిర్ణయంతో ప్రభుత్వ ఖజానాపై ఏటా రూ.18.51 కోట్ల అదనపు భారం పడుతుందని తెలిపారు. వీరి సేవల క్రమబద్ధీకరణ గ్రామీణ, గిరిజన ప్రాంతాల నుంచి చదువుకున్న మహిళలు నిబద్ధత, అంకితభావంతో సూపర్‌వైజర్‌లుగా పనిచేయడానికి ప్రేరేపిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సేవల వ్యవస్థ సమగ్ర అభివృద్ధిని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఈ రంగంలో సేవల నాణ్యతను మెరుగుపరిచి వారిలో ఉత్తమ పనితీరును ప్రోత్సహిస్తుందని చీఫ్ సెక్రటరీ కుమార్ జెనా వివరించారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖకు చెందిన 6 ప్రతిపాదనలు, జలవనరులు, స్త్రీ, శిశు అభివృద్ధి శాఖకు చెందిన ఒక్కో ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెలిపిందని తెలిపారు. సమావేశానికి రాష్ట్ర అభివృద్ధి కమిషనర్, జలవనరుల శాఖ అదనపు కార్యదర్శి అనుగర్గ్, మహిళా శిశు అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శుభా శర్మ, కమిషనర్ కమ్ సెక్రటరీ షాలినీ పండిట్ హాజరయ్యారు.

వీర బ్రహ్మేంద్రస్వామి నవరాత్రులు ప్రారంభం



తిరువీధిలో స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

బరంపురం: నగరంలో స్థానిక డైమాండ్ ట్యాంక్ రోడ్ సమీపంలోని ఉన్నటువంటి పోతులూరు వీర బ్రహ్మేంద్ర స్వామివారి ఆలయంలో 54వ వార్షిక నవరాత్రోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా ఉదయం 9 గంటలకు స్వామివారి ఉత్సవ విగ్రహంతో తిరువీధి నిర్వహించారు. అడుగడుగునా స్వామివారికి తెలుగు మహిళలు ప్రత్యేక పూజల నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో సాయంత్రం స్వామివారి భక్తి గీతాలాపన భజన కార్యక్రమాలు జరిగాయి. ఉత్సవాలు మహా శివరాత్రి వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలియజేశారు.

ముగిసిన ఆలయ ప్రతిష్ఠోత్సవాలు



కొలువుదీరిన లక్ష్మీనరసింహ స్వామి



స్వామివారి దర్శనం కోసం బారులుతీరిన భక్తులు



భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

రాయగడ: సదరు సమితి అమలాభట్ట సమీపంలోని శ్రీక్షేత్ర టౌన్‌షిప్‌లో ఈనెల 24వ తేదీ నుంచి కొనసాగుతున్న లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు గురువారంతో ముగిశాయి. స్థానిక బాలాజీ నగర్‌లోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరాచార్యుల ఆధ్వర్యంలో కనుల పండగగా ప్రతిష్ఠ కార్యక్రమాలు జరిగాయి. వేద పండితుల మంత్రోచ్చరణలు, భక్తుల కోలాహలం మధ్య శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను చేపట్టారు. కార్యక్రమంలో బాలాజీ నగర్‌లోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం ట్రస్టు అధ్యక్షుడు చంద్రమౌళి కుముందాన్, ప్రధాన కార్యదర్శి రాఘవ కుముంధాన్, బీజేడీ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు నెక్కంటి భాస్కర రావు, మాజీ మంత్రి లాల్ బిహారి హిమిరిక తదితరులు పాల్గొన్నారు.

ప్రచారానికి బీజేడీ శ్రీకారం



నెక్కంటికి నీరాజనాలు పలుకుతున్న మహిళలు



శంఖం స్టిక్కర్‌ను గోడపై అతికిస్తున్న నెక్కంటి

రాయగడ: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అధికార బీజేడీ పార్టీ ప్రచారానికి గురువారం శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా ఆ పార్టీ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు నెక్కంటి భాస్కర రావు స్థానిక భైరవీధిలోని బురదల పోలమ్మ అమ్మవారి మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏడో వార్డు పరిధిలోని భైరవీధి, చాకలి వీధి, మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రజల అంగీకారంతో ఇంటి గోడలపై బీజేడీ చిహ్నం శంఖం గుర్తు స్టిక్కర్‌ను అతికించారు. గత రెండు దశాబ్దాలుగా బీజేడీ హయాంలో జరిగిన అభివృద్ధి, అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. నిరంతరం ప్రజల సంక్షేమం కోరే బీజేడీని గెలిపిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని తెలియజేశారు. అంతకుముందు పార్టీ కార్యకర్తలు, మున్సిపాలిటీ కౌన్సిలర్‌తో మాట్లాడి ప్రజలతో మమేకమై ప్రచారం చేయాలని సూచించారు. ఏడో వార్డు కౌన్సిలర్, బిజు యువ జనతాదళ్ పట్టణ శాఖ అధ్యక్షుడు బార్జి జగన్‌మోహన్‌రావు నెక్కంటికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మహేష్ పట్నాయక్, కౌన్సిలర్లు మజ్జి శ్రీనివాస్‌రావు, రోజా, సంతోష్ దొళాయి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గోకార్టింగ్ చాంపియన్‌షిప్



టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన గోకార్టింగ్ జాతీయ స్థాయి కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ముఖ్య అతిథులు, కళాశాల యాజమన్యం.

- గోకార్టింగ్ పోటీల్లో విన్నర్‌గా రఘు ఇంజినీరింగ్ కళాశాల
- హ్యాకథాన్ పోటీల్లో అనిట్స్ కళాశాలకు ప్రథమ స్థానం

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 26 నుంచి 29 వరకు నిర్వహించిన జాతీయ స్థాయి గోకార్టింగ్ చాంపియన్ షిప్, హ్యాకథాన్ ఆవిష్కార్ జాతీయ స్థాయి కార్యక్రమాలు గురువారంతో ముగిశాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రఖ్యాత యూనివర్సిటీల నుంచి హ్యాకథాన్‌కు 35 బృందాలు, గోకార్టింగ్‌కు 14 బృందాలు హాజరయ్యాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన టీసీఎస్ చీఫ్ ఇన్నోవేషన్ అధికారి బాలప్రసాద్ పెద్ది, గీక్స్‌ఫర్ చీఫ్ టెక్నాలజీ అధికారి శిఖర్ గోయల్, టాటా టెక్నాలజీ చీఫ్ ఇంజనీర్ రవీంద్రషా తదితరులు విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇలాంటి జాతీయ స్థాయి కార్యక్రమాల ద్వారా వెలికితీయవచ్చునని వెల్లడించారు. ఇలాంటి జాతీయ స్థాయి కార్యక్రమాలు నిర్వహించిన ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలను ప్రశంసించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు, కార్యదర్శి ఎల్.ఎల్.నాయుడు, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, కన్వీనర్లు డి.శ్రీరాములు, డి.ఆజాద్, అధ్యాపకులు జి.సతీష్‌కుమార్, జె.సురేష్, డి.రఘువీర్, రెడ్డి హరిచందన, సాయితరుణ్ మిశ్రోతో పాటు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. హ్యాకథాన్ జాతీయ కార్యక్రమంలో భాగంగా 'ఎఫెక్టివ్ మేనేజ్‌మెంట్ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ అండ్ డిమోలిషన్' అనే అంశంపై అనిట్స్ ఇంజినీరింగ్ కళాశాల రూపకల్పన చేసిన ప్రాజెక్టుకు ప్రథమస్థానం లభించింది. విజేతలకు రూ.లక్ష బహుమతిగా అందజేశారు. అలాగే రూర్కెలా కోయర్ యూనివర్సిటీ విద్యార్థు లు రూపకల్పన చేసిన 'వ్యర్థాలను తిరిగి వినియో గించడంపై' చూపిన పరిష్కారానికి ద్వితీయ బహుమతి లభించింది. వీరికి రూ.75వేలు నగదు బహుమతి అందించారు. ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపిన గీతమ్ యూనివర్సిటీకి రూ.50 వేలు అందజేశారు. జాతీయ స్థాయి గోకార్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా ఎనిగ్మా (రఘు) ఇంజనీరింగ్ కళాశాల ఎంపికైంది. ఆదిత్య కళాశాలతో పాటు మిగిలిన బృందాలకు వివిధ అంశాల్లో 14 ఉత్తమ బహుమతులు లభించాయి. మొత్తంగా రూ. 4లక్షల విలువైన నగదు బహుమతులను అందజేశారు. వీటిలో 3 గోకార్టింగ్ బృందాలకు విద్యార్థినులు నాయకత్వం వహించడం విశేషం.

హెచ్‌ఐవీపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న బీఆర్‌ఏయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ రజిని

ఎచ్చెర్ల క్యాంపస్: హెచ్‌ఐవీపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేఆర్ రజిని అన్నారు. వర్సిటీలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖలు సంయుక్తంగా ఎయిడ్స్, హెచ్‌ఐవీపై ప్రచార కళా జాతర గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఆమె మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి ఒక దశలో దేశంలో ప్రధాన సమస్యగా మారిందన్నారు.

ప్రచారం, ప్రజల్లో చైతన్యం, నియంత్రణ చర్యలతో పూర్తిగా అదుపులోకి వచ్చిందన్నారు. అయిప్పటికీ సమాజం అప్రమత్తంగా ఉండాలన్నారు. యువత క్రమ శిక్షణతో మెలగాలన్నారు. అధునాతన పోకడల పేరుతోతో జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. విద్యపై ప్రత్యేక దృష్టిపెట్టాలని, ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ చింతాడ రాజశేఖరరావు, జిల్లా రిసోర్స్ పర్సన్ హనుమంతు నాగభూషణరావు పాల్గొన్నారు.

100%కు దగ్గరలో..

- జిల్లాలో 6,39,370 కుటుంబాలకు ఆరోగ్య కార్డుల జారీకి చర్యలు
- ఇప్పటివరకు 5.07 లక్షల మందికి పంపిణీ పూర్తి
- 90 శాతం వరకు పంపిణీ చేయడంతో రాష్ట్రంలోనే 8వ స్థానంలో జిల్లా

అరసవల్లి:

ఆరోగ్య శ్రీ స్మార్ట్ కార్డులను ఇంటింటికీ చేర్చడంలో జిల్లా యంత్రాంగం చక్కటి పనితీరు చూపిస్తోంది. ఇప్పటికే అద్భుత సేవలందిస్తున్న సచివాలయ వ్యవస్థ ద్వారానే క్షేత్ర స్థాయిలో వైద్య సేవలందించే క్రమంలో ఆరోగ్య శ్రీ పథకాన్ని మరింత బలోపేతం చేశారు. ఈ పథకంతో కనీసంగా ప్రోసీజర్ వైద్య ఖర్చు రూ.వెయ్యి నుంచి రూ.25 లక్షల వరకు వైద్య ఖర్చు పరిమితిని పెంచుతూ.. ఈ భారమంతా ప్రభుత్వమే భరించనుంది. ఎంతటి వైద్యమైనా, ఆపరేషన్ అయినా పేదసామాన్య వర్గాలు ఒక్క రూపాయి చెల్లించకుండానే చేయించుకునేలా సీఎం వైఎస్ జగన్ ఈ పథకానికి కొత్త రూపం ఇచ్చారు. ప్రతి ఇంటికి సరికొత్తగా ఆరోగ్యశ్రీ కొత్త స్మార్ట్ కార్డులు అందించేలా చర్యలు చేపట్టారు. జిల్లాలో ఈ కొత్త స్మార్ట్ కార్డులను సచివాలయాల వారీగా అందిస్తున్నారు.

6.39 లక్షల కార్డుల పంపిణీ లక్ష్యంగా..

జిల్లాలో కొత్తగా ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కోసం వైద్యారోగ్య శాఖ గత రెండు నెలల నుంచి ప్రత్యేక డ్రైవ్ మొదలుపెట్టారు. ఈ మేరకు జిల్లాలో మొత్తం 6,39,370 కుటుంబాలకు కొత్త కార్డులను అందించేలా ప్రణాళిక సిద్ధం కాగా, ఇప్పటివరకు జిల్లాకు 5,60,942 కార్డులు జిల్లాకు చేరాయి. ఇందులో ఇప్పటివరకు 5,07,763 కార్డులను అర్హులందరికీ అందజేశారు. 90 శాతానికి పైగా పంపిణీ పూర్తి చేయడంతో రాష్ట్రంలోనే 8వ స్థానంలో మన జిల్లా నిలిచింది. ఆరోగ్యశ్రీ యాప్‌ను ఇంట్లో కనీసం ఒకరైనా డౌన్‌లోడ్ చేసుకునేలా క్షేత్ర స్థాయి సిబ్బంది బాధ్యత తీసుకుంటున్నారు. అలాగే దిశ యాప్ కూడా డౌన్‌లోడ్ చేయించేలా చర్యలు చేపడుతున్నారు.



ఇదే కొత్త స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డు

రూ.25 లక్షలకు పెరిగిన ఆరోగ్యశ్రీ పరిమితి

ఆరోగ్యశ్రీ పరిధిలోకి వచ్చిన జబ్బుల సంఖ్యతో పాటు వైద్య సేవలు, శస్త్రచికిత్సల పరిమితి ఏకంగా రూ.25 లక్షలకు పెంచుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిర్ణయించి అమలు చేస్తున్నారు. ఈక్రమంలో కొత్తగా ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేస్తున్నారు. ఈ కార్డులతో రోగికి తాను కోరుకున్న కార్పొరేట్ ఆస్పత్రిలో ఉచిత వైద్యాన్ని, ఉచిత శస్త్ర చికిత్సలను చేయించేలా తాజా మార్గదర్శకాలున్నాయి. కొత్తగా ఆరోగ్యశ్రీ సేవలు స్మార్ట్ కానున్న నేపథ్యంలో ప్రతి ఇంటా ఆరోగ్యశ్రీ కార్డు అందేలా వైద్యారోగ్య శాఖ చర్యలు చేపడుతోంది. గుండెజబ్బుతో పాటు క్యాన్సర్ వంటి అతిపెద్ద జబ్బులను సైతం ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకువచ్చిన సమాచారాన్ని క్షేత్ర స్థాయిలో తెలిసేలా అవగాహన కలిగించేలా చర్యలు చేపడుతున్నారు. గతంలో క్యాన్సర్ చికిత్సకు ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.5 లక్షల వరకు పరిమితి ఉండేది. ఆ తర్వాత ఖర్చులన్నీ రోగులే భరించాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు ఆ పరిమితిని ఎత్తివేస్తూ తాజా మార్గదర్శకాలు వెలువడ్డాయి. దీంతో రోగికి ఖర్చయిన ప్రతి పైసా గరిష్టంగా రూ.25 లక్షల వరకు ప్రభుత్వమే భరిస్తుంది. అలాగే ఇంతవరకు ఆరోగ్యశ్రీ పరిధిలో 1,059 ప్రొసీజర్స్ ఉండగా, ఇప్పుడు ఏకంగా 3,257 వ్యాధులను (ప్రొసీజర్స్) ఈ పరిధిలోకి తీసుకొచ్చారు. 2019 నుంచి ఇప్పటివరకు 2.40 లక్షల మందికి రూ.500 కోట్లకు పైగా విలువైన వివిధ రకాల శస్త్ర చికిత్సలను ఆరోగ్యశ్రీ ద్వారానే సేవలందించారు.

త్వరలోనే శతశాతం పంపిణీ



ఆరోగ్యశ్రీ పరిధి రూ.25 లక్షలకు పెరగడంతో అర్హులైన వారంతా ఈ స్మార్ట్ కార్డులను తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటివరకు తమకు జారీ అయిన కార్డుల్లో 90 శాతం వరకు పంపిణీ పూర్తి చేశాం. ఇక వంద శాతం పంపిణీకి చర్యలు చేపడుతున్నాం. అలాగే సరికొత్త సాంకేతికతతో యాప్‌ను, అలాగే క్యూఆర్ కోడ్‌తో ఈ ఆరోగ్యశ్రీ కార్డు ప్రతి ఇంటికి చేర్చడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ క్యూఆర్ కోడ్‌స్కాన్ చేస్తే ఇంటిలో సభ్యుల వివరాలతో పాటు సమీపంలో ఉన్న నెట్‌వర్క్ ఆస్పత్రుల వివరాలన్నీ తెలుస్తాయి. ప్రతి ఒక్కరూ ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.

– డాక్టర్ ప్రకాశరావు, జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్

క్లుప్తంగా

750 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎస్సై జ్ఞానప్రసాద్, సిబ్బంది

రామభద్రపురం: మండలంలోని శివారు గ్రామం చందాపురంలో ఎస్సై జ్ఞానప్రసాద్ సిబ్బందితో కలిసి సారా బట్టీలపై గురువారం దాడులు చేశారు. ఈ సందర్భంగా 750 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ చందాపురం పరిసరాలలో సారా తయారవుతోందన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించామని చెప్పారు. ఈ సందర్భంగా సారా తయారీ కోసం సిద్ధం చేసి ఉంచిన 750 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశామని తెలిపారు. సారా తయారీదారులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డిప్యూటీ డీఈఓగా సీహెచ్ సుగుణ

పార్వతీపురంటౌన్: పార్వతీపురం ఐటీడీఏ డిప్యూటీ డీఈఓగా సీహెచ్ సుగుణ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు డిప్యూటీ డీఈఓగా విధులు నిర్వహించిన ఎన్.ప్రేమ్ కుమార్ డీఈఓగా విజయనగరం బదిలీపై వెళ్లారు. సీహెచ్ సుగుణ ఇప్పటివరకు రేగిడి ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలో విధులు నిర్వహించారు. పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో విద్యారంగంలో గల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఆమె ఈ సందర్భంగా తెలిపారు.

ఏపీ సీడ్స్ రైతులకు బకాయిల చెల్లింపు

సాలూరు రూరల్: డిప్యూటీ సీఎం, గిరిజన శాఖామంత్రి పీడిక రాజన్నదొర చొరవతో విడుదలైన ఏపీసీడ్స్ రైతులు బకాయిల సొమ్ము చెల్లింపు గురువారం ప్రారంభమైంది. ఈ మేరకు 90 మంది రైతులకు రూ.ఒక కోటి వారి ఖాతాల్లో జమఅయినట్లు ఏపీసీడ్స్ జిల్లా మేనేజర్ ఎస్.పద్మజ తెలిపారు. 300 మంది రైతులకు ఏపీసీడ్స్ రూ.5.32కోట్లు బకాయిలు ఉన్న విషయం తెలిసిందే. మిగిలిన రైతులకు మరో రెండురోజుల్లో బకాయి సొమ్ము జమ అవుతుందని ఆమె చెప్పారు. నాలుగు నెలలుగా ఏపీసీడ్స్‌కి వరి విత్తనాలు ఇచ్చిన రైతులకు బకాయిలు చెలించకపోవడంతో వారంతా డిప్యూటీ సీఎం రాజన్నదొరను కలిసి వారి కష్టాలు వివరించిన విషయం విదితమే. ఈ మేరకు రైతులు సమస్యను వెంటనే సీఎం వైఎస్ జగన్‌కు డిప్యూటీ సీఎం రాజన్నదొర వివరించడంతో వెంటనే బకాయిలు విడుదల కాగా గురువారం తమ ఖాతాలో సొమ్ము జమ అవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చోరీ కేసు ఛేదించిన పోలీసులు



చోరీకి గురైన బంగారం చూపిస్తూ, కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ బాలకృష్ణ

పాచిపెంట: మండలంలోని మాతమూరు గ్రామంలో ఈనెల 20వతేదీన జరిగిన బంగారం చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ మేరకు గురువారం స్థానిక పోలీసుస్టేషన్‌లో సీఐ బాలకృష్ణ విలేకరుల సమావేశం నిర్వహించి కేసు వివరాలు వెల్లడించారు. గ్రామంలో ఈనెల 20వ తేదీన ముఖి సరస్వతమ్మ ఇంట్లో బంగారం చోరీ జరిగింది. బాధితురాలి ఫిర్యాదుమేరకు ఎస్సై నారాయణరావు ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ముఖి సరస్వతమ్మకు దగ్గర బంధువైన రామభద్రపురం మండలం కొట్టక్కి గ్రామానికి చెందిన చుక్కా సింహాచలం గురువారం సాలూరు పట్టణంలో బంగారం అమ్మేందుకు ప్రయత్నించగా పోలీసులు పట్టుకున్నారు. సదరు వ్యక్తి చోరీకి పాల్పడిన 12తులాల బంగారం స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. చోరీ కేసును ఛేదించిన పాచిపెంట ఎస్సై నారాయనరావు, సిబ్బందిని సీఐ అభినందించారు.

లారీ,టిప్పర్ ఢీ



టిప్పర్ నుంచి డ్రైవర్‌ను బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్న స్థానికులు

విజయనగరం క్రైమ్: గజపతినగరం నుంచి విశాఖ వెళ్తున్న టిప్పర్ చెల్లూరు జంక్షన్ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని బలంగా ఢీకొంది. ఈ సంఘటనలో టిప్పర్ డ్రైవర్ వాహనంలోనే ఇరుక్కుపోయాడు. స్థానిక ప్రజలు ఈ విషయం గమనించి అప్రమత్తమై వెంటనే డ్రైవర్‌ను బయటకు తీశారు. డ్రైవర్ పరిస్థితి బాగానే ఉందని రూరల్ ఎస్సై వాసుదేవ్ గురువారం తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి

- ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర
- సాలూరులో మహిళా మార్ట్ ప్రారంభం



మహిళామార్ట్‌ను ప్రారంభిస్తున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: రాష్ట్రంలో మహిళల ఆర్థిక స్వావలంబనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషిచేస్తున్నారని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన సాలూరు పట్టణంలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహిళామార్టును ప్రారంభించి సరుకులను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహిళలకు పనులు, పదవుల్లో రిజర్వేషన్లు కల్పించడంతో పాటు అనేక సంక్షేమ పథకాలు, కార్యక్రమాల ద్వారా వారి ఆర్థిక, సామాజిక అభ్యున్నతికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఇది జిల్లాలో తొలిసారిగా ఏర్పాటుచేసిన మహిళామార్ట్ అని, రాష్ట్రంలో 12వదని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతంలో ఇది ఏర్పాటుచేయడం వల్ల జగనన్న పాలనలో మహిళల అభివృద్ధి, చైతన్యానికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. స్వయం సహాయక సంఘాలు తయారుచేసిన ఉత్పత్తులతో పాటు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో గుర్తింపు పొందిన ఉత్పత్తులను ఈ మార్ట్‌లలో విక్రయిస్తారని తెలిపారు. నాణ్యమైన సరుకులను సరసమైన ధరలకే అందిస్తారన్నారు. ఈ మార్ట్‌లను ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు సందర్శించి, వస్తువులు కొనుగోలు చేసి మహిళామార్ట్‌లను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. వ్యాపార పరంగా ప్రజలకు అవసరమైన అధికంగా అమ్ముడయ్యే వస్తువులను గుర్తించి వాటిని తీసుకువస్తుండడం తదితర వ్యాపారపరమైన విధానాలను నిర్వాహకులు అవలంబిస్తే మార్ట్‌లు మరింత విజయవంతమవుతాయని హితవు పలికారు.

రాష్ట్రంలో రూ.58 కోట్ల టర్నోవర్

రాష్ట్రంలో 11 మహిళామార్ట్‌ల ద్వారా రూ.58 కోట్ల టర్నోవర్ జరుగుతోందని మెప్మా ఎం.డి విజయలక్ష్మి తెలిపారు. తిరుపతి మార్ట్ నుంచి అధికంగా లాభాలు రాగా వాటిని ఆ మహిళాసంఘాలకు పంపిణీ చేశామని తెలిపారు. తిరుపతి, శ్రీకాకుళం జిల్లాల్లో కొనుగోలు అధికంగా జరుగుతున్న దృష్ట్యా రెండవ మహిళామార్ట్‌లను ఏర్పాటుచేశామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్‌చైర్‌పర్సన్ జర్జాపుదీప్తి, వైస్‌చైర్మన్ వంగ పండుఅప్పలనాయుడు, మెప్మా పీడీ సుధాకరరావు, ప్రజాప్రతినిధులు, నాయకులు, మెప్మా ఆర్‌పీలు, మహిళాసంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సామగ్రి కొనుగోలు చేసి బిల్లు తీసుకుంటున్న రాజన్నదొర

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

- విజయనగరంలో మాజీ కౌన్సిలర్ దంపతులు
- రాజాంలో 135 కుటుంబాల వారు



రాజాం: వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, జనసేన పార్టీ కార్యకర్తలు



విజయనగరం: డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న మాజీ కౌన్సిలర్ బొబ్బాది త్రినాథరావు, విజయలక్ష్మి దంపతులు

విజయనగరం: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో విజయనగరంలో టీడీపీకి గట్టి దెబ్బ తగిలింది. రెండు దశాబ్దాల పాటు ఆ పార్టీలో ఉన్న నగరంలోని 39వ డివిజన్‌కు చెందిన మాజీ కౌన్సిలర్లు బొబ్బాది త్రినాథరావు, విజయలక్ష్మి దంపతులతో పాటు వారి కుటుంబసభ్యులు, ఇతర అనుచరులు గురువారం టీడీపీకి గుడ్ బై చెప్పి వైఎస్సార్‌సీపీలో చేరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరిన వారికి కోలగట్ల వీరభద్రస్వామి, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి తదితరులు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ మేరకు డివిజన్‌లో పరిధిలో నిర్వహించిన చేరికల కార్యక్రమం సందడి వాతావరణంలో సాగింది. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ తాము చేస్తున్న అభివృద్ధి, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్న తత్వాన్ని గుర్తించి వైఎస్సార్‌సీపీలోకి చేరడం శుభపరిణామంగా పేర్కొన్నారు. ఇప్పటికే పార్టీలో ఉన్న వారితో పాటు నూతనంగా చేరిన వారు అందరూ తమకు సమానమేనని రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీలో చేరిన బొబ్బాది త్రినాథరావు మాట్లాడుతూ నగరంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఆకర్షితుడినై కోలగట్ల వీరభద్ర స్వామి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరానని చెప్పారు. తనతో పాటు కుటుంబ సభ్యులు ఇతర ముఖ్య నాయకులు కూడా తన వెంట పార్టీ మారినట్లు పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో కోలగట్ల విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని మాట ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముచ్చులయయాదవ్, జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ వీఎస్ ప్రసాద్, కార్పొరేటర్ తొగురోతు సంధ్యారాణి, వివిధ డివిజన్‌ల కార్పొరేటర్లు కంటుభుక్త తవిటి రాజు, పిన్నింటి కళావతి, బోనెల ధనలక్ష్మి, దాసరి సత్యవతి, కడియాల రామకృష్ణ, పార్టీ నాయకులు కెల్ల త్రినాథ్, నారాయణప్పుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

రాజాంలో..

రాజాం: పట్టణంలో వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ మరింత బలం పుంజుకుంటోంది. ఈ మేరకు గురువారం 20వ వార్డు పరిధిలో హరిజన వీధికి చెందిన 135 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరాయి. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గం ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ పార్టీ కార్యాలయం వద్ద శిఖ దిలీప్, శిఖ పండు, టొంపల అనిల్, కూన నరేష్, గోకవలస ప్రశాంత్, సర్వశుద్ధి దివాకర్, విష్ణుపాత్రుని దుర్గాప్రసాద్, తలచింతల గణేష్, గొండేల తేజ, గొండేల పవన్, ఈర్ల భవాని, బొడ్డేపల్లి ఈశ్వర రావు తదితరులతో పాటు మరికొంతమందికి పార్టీ కండువాలు వైఎస్సార్‌సీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజేష్ మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉన్న రాజాం మున్సిపాల్టీలో పార్టీకి మరింత బలం పెరిగిందని సంతోషం వ్యక్తం చేశారు. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారని, 20వ వార్డులో చదువుకున్న విద్యావంతులు పెద్దఎత్తున ఇతర పార్టీల నుంచి వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీలో చేరడం శుభపరిణామమన్నారు. రాజాం పట్టణంలోని అన్ని వార్డుల్లో ఇటీవల పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీలో చేరికలు జరిగాయని, సార్వత్రిక ఎన్నికల్లో వారంతా పార్టీకి బాగా పనిచేసి, మున్సిపాల్టీ నుంచి మంచి మెజార్టీని తెస్తారని ఆకాంక్షించారు. పార్టీలో చేరిన పలువురు మాట్లాడుతూ సీఎం వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి పరిపాలన చాలా బాగుందని, మా కుటుంబాలన్నీ పార్టీలతో సంబంధం లేకుండా లబ్ధిపొందాయని, అందుకే తామంతా పార్టీలో చేరామని తెలిపారు. రాజాం నియోజకవర్గంలో డాక్టర్ తలే రాజేష్ గెలుపు తమ భుజస్కంధాలపై వేసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, పార్టీ నేతలు సింబాల రాము, యందవ అప్పన్న, కంటా శ్రీనివాసరావు, పల్లెల శ్రీనివాసరావు, ముగడ రవి, పార్టీ అధికార ప్రతినిధి ఆశపు సూర్యం, 20 వ వార్డు వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

పాముకాటు బాధితులకు

పీహెచ్‌సీల్లో ఏఎస్‌వీ వైల్స్

- అందుబాటులో ఉంచిన ప్రభుత్వం
- సకాలంలో చికిత్స అందడంతో నిలుస్తున్న ప్రాణాలు



చికిత్స అనంతరం సర్వజన ఆస్పత్రిలో డిశ్చార్జ్ అవుతున్న రామారావు



ఏఎస్‌వీ వ్యాక్సిన్



ఈ ఫొటోలో కనిపిస్తున్న యువకుడి పేరు కె.సాయి మణికంఠ. గంట్యాడ మండలంలోని సిరిపురం గ్రామానికి చెందినవాడు. ఇంటి వెనుకన ఉన్న పొలం గట్టుపై నిలబడి ఫోన్ మాట్లాడుతుండగా ఈనెల 27న పాము కాటు వేసింది. దీంతో కుటుంబసభ్యులు 108 అంబులెన్సు ద్వారా జిల్లాకేంద్రంలో గల ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. సకాలంలో వైద్యం అందడంతో కోలుకున్నాడు.

విజయనగరం ఫోర్ట్: పై ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు బూడుమూరు రామారావు. చీపురుపల్లి మండలంలోని సంభాం బొండపల్లి గ్రామానికి చెందినవాడు. ఈ నెల 14వతేదీన పొలంలో మొక్కజొన్న కండెలు కోస్తుండగా పాము కాటు వేసింది. దీంతో స్పృహ కోల్పుయాడు. వెంటనే కుటుంబ సభ్యులు గ్రామంలో ఉన్న పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడ యాంటీ స్నేక్ వీనమ్(ఏఎస్‌వీ)ని పీహెచ్‌సీ వైద్యసిబ్బంది రామారావుకు ఇచ్చారు. దీంతో ప్రమాద తీవ్రత తగ్గింది. ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి రిఫర్ చేశారు. 14 రోజుల పాటు అక్కడ చికిత్స పొంది కోలుకోవడంతో బుధవారం వైద్యసిబ్బంది డిశ్చార్జ్ చేశారు. వీరిద్దరే కాదు. జిల్లాలో అనేక మంది పాము కాటు బాధితులకు సకాలంలో చికిత్స అందడం వల్ల ప్రాణాలు నిలుస్తున్నాయి. ప్రజల ఆరోగ్యానికి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం పెద్ద పీట వేస్తూ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఎంతో మందికి ఉచితంగా సేవలు అందిస్తోంది. అంతేకాకుండా చికిత్సానంతర భృతిని వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కింద చెల్లిస్తోంది. రోగులు, క్షత గాత్రులను సకాలంలో 108 అంబులెన్సుల ద్వారా చేర్పించి ఎంతోమంది ప్రాణాలు కాపాడుతున్నారు. అదేవిధంగా పాము కాటు బాధితుల కోసం జిల్లాలో గల 50 పీహెచ్‌సీల్లోనూ జిల్లాలో 50 పీహెచ్‌సీలు ఉన్నాయి. ఆ పీహెచ్‌సీల్లో ఏటా 500 నుంచి 600 మంది వరకు పాముకాటు బాధితులకు చికిత్స అందిస్తున్నారు.

సకాలంలో వస్తే ప్రాణాపాయం తప్పుతుంది



పాముకాటుకు గురైన బాధితుడిని వెంటనే సమీపంలో ఉన్న పీహెచ్‌సీకి తీసుకుని వెళ్లి యాంటీస్నేక్ వీనమ్(ఏఎస్‌వీ) ఇస్తే ప్రాణాపాయం తప్పుతుంది. కొంతమంది పీహెచ్‌సీలో చికిత్స పొంది ఇంటికి వెళ్లిపోవచ్చు. కొంతమందికి వ్యాక్సిన్ ఇచ్చినప్పటికీ పరిస్థితి విషమంగా ఉంటే సర్వజన ఆస్పత్రికి రిఫర్ చేసి అక్కడ చికిత్స అందిస్తారు. ప్రతి పీహెచ్‌సీలో ఏఎస్‌వీ వైల్స్ 50 వరకు అందుబాటులో ఉంచాం. ఒకేసారి ఐదుగురు బాధితులు వచ్చినా చికిత్స అందించే విధంగా చర్యలు తీసుకున్నాం. ఏఎస్‌వీ సకాలంలో ఇస్తే ప్రాణాపాయం తగ్గుతుంది.

డాక్టర్ ఎస్.భాస్కరావు, డీఎంహెచ్ఓ

సారా తాగి వ్యక్తి మృతి



సత్యం మృతదేహం

రేగిడి: వివాహ వేడుకకు వెళ్లి సారా తాగిన వారిలో ఓ వ్యక్తి మృతిచెందగా మరో ఇద్దరు అస్వస్థతకు గురయ్యారు. ఈ సంఘటనకు సంబంధించి రేగిడి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మెరకముడిదాం మండలంలోని రాచపేట గ్రామానికి చెందిన రౌతు సత్యం (65), సీహెచ్ అప్పారావు, ఎ.సూర్యనారాయణలు పాలకొండలో జరిగిన ఓ వివాహానికి వెళ్లారు. అక్కడ సారా తాగి ఆటోలో తిరుగుపయనమయ్యారు. మండలంలోని రెడ్డిపేట జంక్షన్‌కు వచ్చేసరికి సత్యం అపస్మారక స్థితిలో ఉన్న విషయాన్ని ఆటో డ్రైవర్ గుర్తించి సపర్యలు చేపట్టాడు. అప్పటికే మృతిచెందినట్లు గుర్తించిన ఆటో డ్రైవర్ 108కు సమాచారం అందించాడు. ఆటోలో ఉన్న మరో ఇద్దరు కూడా అపస్మారక స్థితికి చేరుకున్నారు. వారిద్దరినీ 108 ద్వారా రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యులు మెరుగైన చికిత్సకోసం రాజాం కేర్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పరీక్షలకు వేళాయె

- నేటి నుంచి ఇంటర్మీడియట్,
- మార్చి 18 నుంచి పదోతరగతి పబ్లిక్



పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు



పార్వతీపురం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న ప్రత్యేక అధికారి లోచర్ల రమేష్

పార్వతీపురంటౌన్: పరీక్షల సీజన్ మొదలైంది. ఇంటర్మీడియట్, 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు షెడ్యూల్ విడుదల కావడంతో విద్యార్థులను సన్నద్ధం చేయడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు నిమగ్నమవుతున్నారు. అదేవిధంగా పరీక్షలకు ఏర్పాట్లు చేయడంలో అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. గత ఏడాది ఇంటర్మీడియట్ పరీక్షలు ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన నిర్వహించారు. అయితే ఈ ఏడాది ఇంటర్మీడియట్, టెన్త్ పరీక్షలు కొత్త జిల్లాల ప్రాతిపదికన జరగనున్నాయి.

ఇంటర్మీడియట్ పరీక్షలకు 19,856 మంది సన్నద్ధం

శుక్రవారం నుంచి 19 వ తేదీ వరకు జరగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా 19,856 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. గురువారం నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 17,268 మంది ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు ఇప్పటి వరకు పరీక్ష ఫీజు చెల్లించారు. గతేడాది పరీక్ష తప్పిన 2,588మంది విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించారు. ఈ ఏడాది మొత్తం 19,856మంది పరీక్షలు రాయనున్నారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 32పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశారు.

పది పరీక్షలకు 11,198 మంది సిద్ధం

మార్చి 18వ తేదీ నుంచి జరగనున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు పార్వతీపురం మన్యం జిల్లాలో 11,198 మంది విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. వారిలో రెగ్యులర్ 10,534 మంది, ప్రైవేట్‌గా 664 మంది హాజరుకానున్నారు. పది పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 66 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిలో నాలుగు సమస్యాత్మక పరీక్షా కేంద్రాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో పరీక్షల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు.

విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అధిక మార్కుల సాధనకు ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సాయంత్రం పూట ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్ ఉన్నత పాఠశాలల్లోని టెన్త్ విద్యార్థులకు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు అదనపు తరగతులు జరుగుతున్నాయి.

పదోతగరతి విద్యార్థులకు ఉచిత ప్రయాణం

పదోతరగతి రాసే విద్యార్థులకు ఉచిత ప్రయాణ అవకాశాన్ని ప్రభుత్వం ఈ ఏడాది కూడా కల్పించింది. హాల్ టికెట్ చూపిస్తే చాలు పల్లె వెలుగు బస్సులో ఉచితంగా ప్రయాణం చేసే విధంగా ఆర్టీసీ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. జిల్లా వ్యాప్తంగా మూడు డిపోల పరిధిలో 143పల్లె వెలుగు బస్సులు ఉన్నాయి. వాటిలో ఉచిత ప్రయాణానికి అనుగుణంగా చర్యలు చేపట్టారు.

ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం



శతశాతం ఉత్తీర్ణత సాధించడమే కాకుండా కార్పొరేట్ పాఠశాలలకు గట్టి పోటీ ఇచ్చే విధంగా విద్యార్థులకు శిక్షణ అందజేస్తున్నాం. పదవ తరగతి విద్యార్థులకు ప్రతిరోజూ అదనంగా 2 గంటలు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం.

పగడాలమ్మ, డీఈఓ

పకడ్బందీగా ఏర్పాట్లు



ఇంటర్‌మీడియట్ పరీక్షల కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం. పరీక్షా కేంద్రాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేలా చర్యలు చేపట్టాం. జిల్లావ్యాప్తంగా 32 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు శుక్రవారం నుంచి నిర్వహించనున్నాం. జిల్లాలో 19,856 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షా కేంద్రాలకు నిర్ణీత సమయానికి హాజరు కావాలి. శతశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ప్రభుత్వ కళాశాల్లో విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చాం.

మంజులా వీణ,
జిల్లా వృత్తి విద్యాశాఖాధికారిణి

నేటినుంచి ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు

- విజయనగరం జిల్లాలో రాయనున్న 45,755 మంది



సీసీ కెమెరాలను అనుసంధానం చేసిన జిల్లా కేంద్రంలోని కంట్రోల్ రూమ్

విజయనగరం అర్బన్: ఇంటర్మీడియట్ వార్షిక థియరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. మార్చి 20వ తేదీతో ముగిసే ఈ పరీక్షలపై పర్యవేక్షణ కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు పరీక్ష కేంద్రంలోని ప్రతి గదిలోనూ సీసీ కెమెరా ఏర్పాటు చేసి వాటిని జిల్లా కేంద్రానికి, రాష్ట్రస్థాయి అధికారులకు అనుసంధానం చేస్తూ చర్యలు తీసుకున్నారు. ఏ పరీక్షా కేంద్రంలోని తరగతి గదినైనా ఏ క్షణంలో అయినా ఇటు జిల్లా కేంద్రంలోనిగాని, రాష్ట్ర స్థాయి అధికారులుగానీ చూడగల సాంకేతిక వ్యవస్థను అమలులోకి తెచ్చారు. జిల్లాలోని ఆర్ఐఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో ఈ వ్యవస్థను నిర్వహిస్తున్నారు. దీంతో మాల్ ప్రాక్టీస్‌కు ఆస్కారం లేకుండా పటిష్టమైన నిర్వహణకు శ్రీకారం చుట్టారు. జిల్లాలో మొత్తం 45,755 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షలు రాయనున్నారు. వారిలో ప్రథమ సంవత్సరం 20,630 మంది, ద్వితీయ సంవత్సరం 25,125 మంది ఉన్నారు. మొత్తం 73 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణను ఇంటర్‌మీడియట్ పరీక్షల జిల్లా కన్వీనర్ మజ్జి ఆదినారాయణ, జిల్లా పరీక్షల కమిటీ (డీఈసీ) సభ్యులు జిల్లా స్థాయిలో పర్యవేక్షిస్తారు. 73 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 73 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, రెగ్యులర్ అధ్యాపకులు, లైబ్రేరియన్లు, ఫిజికల్ డైరెక్టర్లను ఇందుకోసం నియమించారు. దాదాపు 1,200 మంది ప్రభుత్వ టీచర్లను ఇన్విజిలేటర్లుగా నియమించారు. పరీక్షలకు ఇన్విజిలేటర్ విధులు నిర్వహిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు, జూనియర్ కళాశాల అధ్యాపకులకు గౌరవవేతనం చెల్లింపులు ఆన్‌లైన్‌లో జరగనున్నాయి.

ఆరుగురు జూదరులపై కేసు నమోదు

లక్కవరపుకోట: మండలంలోని జమ్మాదేవిపేట గ్రామం సమీపంలో జూదం ఆడుతున్న వ్యక్తులపై ఎల్.కోట ఎస్సై గోపాలరావు ఆధ్వర్యంలో పోలీసులు గురువారం సాయంత్రం దాడి చేశారు. ఈ సందర్భంగా జూదం ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ 11,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

8 నుంచి రామతీర్థంలో మహాశివరాత్రి ఉత్సవాలు

- ఉత్సవాలపై సమీక్షించిన ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు
- సామాన్య భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామివారి దేవస్థానంలో ఈ నెల 8 నుంచి జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు సూచించారు. ఉత్సవ ఏర్పాట్లపై ఆర్డీఓ సూర్యకళతో కలిసి వివిధ శాఖల అధికారులతో గురువారం సమీక్షించారు. శాఖల వారీగా అధికారులతో మాట్లాడి ఉత్సవాల ఏర్పాట్లపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉత్సవాల్లో పాల్గొనే సామాన్య భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. పారిశుద్ధ్య పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. భక్తుల సౌకర్యార్థం విజయనగరం, శ్రీకాకుళం జిల్లా కేంద్రాల నుంచి ఆర్టీసీ బస్సులను నడపాలన్నారు. వైద్య సేవలు అందించడంతో పాటు అంబులెన్సులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఉత్సవాల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. క్షేత్ర పరిసర ప్రాంతాల్లో అదనపు విద్యుత్ కాంతులను ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులను కోరారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసుకోవాలని పోలీస్ బందోబస్తు నిర్వహించాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. తమిళనాడులోని అరుణాచలేశ్వరుల పర్వతంపైన ఏ విధంగా శిఖర దీపాన్ని వెలిగిస్తారో అదే విధంగా రామతీర్థంలో కూడా మహాశివరాత్రి పర్వదినాన కోదండ రామస్వామివారి పర్వతంపై శిఖరదీపం వెలిగిస్తామని చెప్పారు.

రామ కోనేరులో నీరు తగ్గడంతో భక్తుల పుణ్యస్నానాలకు ఇబ్బందులు లేకుండా సొంతంగా ట్యాంకర్లు ఏర్పాటు చేస్తానని చెప్పారు. జాతరలో వినోదం కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయిస్తానన్నారు. శివరాత్రి ఉత్సవాల కోసం జెడ్పీ నిధులు మంజూరు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, పార్టీ మండలాధ్యక్షుడు చనమల్లు వెంకటరమణ, ఉత్సవ పర్యవేక్షణాధికారి రమేష్ బాబు, ఈఓ శ్రీనివాసరావు, ఎస్ఐ రామగణేష్, ఎంపీడీఓ రామారావు, డీటీ శైలజ, గ్రామపెద్దలు కంచరాపు రాము, దుర్గారావు, రాంబార్కి రామారావు, నడుపూరి పరిసినాయుడు, సత్యం, తదితరులు పాల్గొన్నారు.